క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

తుక్కుగూడ: మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఈ సమావేశంలో ఈ నెల 11న ఎంపిక చేసే బ్లాక్ కాంగ్రెస్ 1, 2, మండల, డివిజన్, మున్సిపల్, కార్పొరేషన్, గ్రామ, బూత్ నూతన కమిటీల ఏర్పాటుపై చర్చ, అభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా శివసేనా రెడ్డి, ధారాసింగ్ హాజరవుతున్నారన్నారు. పార్టీ శ్రేణులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలను పట్టుకుంటున్న బ్లూ క్రాస్ సొసైటీ సిబ్బంది

తుక్కుగూడ: మున్సిపాలిటీలో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం కొనసాగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం 8వ రోజు నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలో ఉన్న పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. వీధులు, నాలాలు క్లీన్ చేయడంతో పాటు ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని ప్రజలకు సూచించారు. 09, 10వ వార్డుల్లో వీధి కుక్కలను పట్టుకున్నామని, ప్రజలందరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ స్ఫూర్తి, ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి ఆర్‌సీఐ (సీపీడీసీ) వరకు ఉన్న రోడ్డులో ప్రమాదాలను నివారించడానికి స్పీడ్ బ్రేకర్లు వేయాలని మున్సిపాలిటీ బీజేపీ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఏ.వాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ రోడ్డులో ప్రమాదకరంగా మూలమలుపులు ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. స్పీడ్ బ్రేకర్ల కోసం జనవరి 2023లో కౌన్సిల్ రూ.5లక్షల నిధుల వినియోగానికి తీర్మానం చేసిందన్నారు. నిధులు మంజూరై సుమారు 18 నెలలు అవుతున్నా అధికారులు వాటిని ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హైకోర్టుకాలనీ, రాక్‌టౌన్‌కాలనీ, మోర్ మార్కెట్, చిత్ర లేఅవుట్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ సిరినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ ఆంధ్రకేసరినగర్, హనుమాన్‌నగర్, జేబీకాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు.

న్యాయవాదిని కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని న్యాయవాదిని కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చింతలకుంటలో ఉంటున్న హైకోర్టు న్యాయవాది పాలడగు నారాయణ (52) ఈ నెల 7న ఆఫీస్‌కు వెళ్లి ఇంటికి రాలేదు. వెంకటేశ్ అనే వ్యక్తి, నారాయణ భార్య సువర్ణమ్మకు ఫోన్‌చేసి నీ భర్తను నేనే కిడ్నాప్ చేశానని నాకు డబ్బులు కావాలని ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం వెంకటేశ్ అదుపులోకి తీసుకుని విచారించగా న్యాయవాది నారాయణ తనకు రూ. 35 లక్షల ఇవ్వాలని, ఎన్ని సార్లు అడిగినా ఇవ్వకపోవడంతో తానే కిడ్నాప్‌కు పాల్పడినట్లు వెంకటేశ్ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రంక్‌లైన్ పనుల్లో వేగం పెంచాలి

ఎల్‌బీనగర్: గత రెండేళ్లుగా సాగుతున్న ట్రంక్ లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. సోమవారం హయత్‌నగర్‌లోని జలమండలి, సివరేజీ బోర్డు మేనేజర్ శ్రీనివాస్ రెడ్డిని ప్రజావాణి కార్యాక్రమంలో కలిసి పనులు త్వరగా చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల జాప్యంతో సమీప కాలనీలవాసులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచాలన్నారు.



గంగారం- సిరిగిరిపురం రోడ్డుకు ఇరువైపులా గుంతలు తవ్వుతున్న కూలీలు



చిన్నతూప్రా నర్సరీలో పెంచుతున్న మొక్కలు

వర్షం కురిస్తే వన మహోత్సవమే..

- మొక్కలు నాటేందుకు అధికారుల ఏర్పాట్లు
- ముమ్మరంగా గుంతల తవ్వకం పనులు

మహేశ్వరం: హరిత తెలంగాణ సాధనే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి అధికారులు సిద్ధమవుతున్నారు. పచ్చదనంతో పాటు అటవీ శాతాన్ని పెంచాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహేశ్వరం మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద సుమారు 3.50 లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రతీ జీపీలో నర్సరీ ఏర్పాటు చేసి 10 వేల చొప్పున మొక్కలను నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో 15 వేల మొక్కలు పెంచుతున్నారు. ప్రతీ జీపీలో ఎనిమిది వేల మొక్కలకు తగ్గకుండా నాటాలని ప్రత్యేకాధికారులు, సెక్రటరీలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో గుంతలు తీసే పనులు ప్రారంభించారు. ఒకటి, రెండు భారీ వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటుతామని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకోసం జీపీలకు వచ్చే నిధుల్లో పదిశాతం మొత్తాన్ని గ్రీన్ బడ్జెట్‌కు వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచుతున్నారు. వీటి సంరక్షణ కోసం ప్రత్యేక కూలీలను ఏర్పాటు చేశారు. ఎండ, వేడిమి నుంచి తట్టుకొనేలా గ్రీన్‌నెట్ వేసి కాపాడుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..



గంగారం పంచాయతీ నర్సరీలో సుమారు పది రాకాలకు చెందిన పది వేల మొక్కలు పెంచుతున్నాం. గ్రామంలో ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో ఇప్పటికే స్థలాలను గుర్తించాం. ప్రస్తుతం గుంతలు తవ్విస్తున్నాం. వర్షాలు కురవగానే మరిన్ని గుంతలు తవ్వి ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే మొక్కలు నాటుతాం.

– నవీన్‌కుమార్, సెక్రటరీ, గంగారం

ఇంటింటికీ ఆరు మొక్కలు



వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో సుమారు 2 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంటింటికీ ఆరు రకాల పండ్లు, పూలు, ఔషధ మొక్కలను పంపిణీ చేస్తాం. ప్రతిఒక్కరూ వన మహోత్సవానికి స్వచ్ఛందంగా సహకరించాలి.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం

ఇందిరమ్మ పట్టాలకు న్యాయం చేయాలి



బాలాపూర్ రెవెన్యూ సదస్సులో వినతిపత్రం ఇస్తున్న బొర్ర రవి

బడంగ్‌పేట్: గతంలో ఇందిరమ్మ పేరుతో ఇచ్చిన పట్టాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పట్టాల బాధితులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి మాట్లాడుతూ.. బాలాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 74లో మాదిగలు దున్నుకుంటున్న కొంత భూమిని ఏఆర్‌సీఐలోకి తీసుకొని మిగతా భాగంలో ఇళ్లను నిర్మించుకునేందుకు ఇందిరమ్మ పట్టాలు ఇచ్చారన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇళ్లను నిర్మించుకోలేదని ఆరోపించారు. ఆ స్థలాల్లో ఇప్పుడు ఇళ్లను నిర్మించుకుంటుంటే రెవెన్యూ అధికారులు కూల్చివేస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన పట్టాలకు ప్రొసీడింగ్ నంబర్లను ఇచ్చి పట్టాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మస్కూరి సుధాకర్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేదునూరు వాసులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు గ్రామంలోని 339 కుటుంబాల ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామం నుంచి 1500 కుటుంబాలు దరఖాస్తులు చేసుకున్నారని, అందులో 339 కుటుంబాల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా వదిలేశారన్నారు. దీంతో ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అందక నష్టపోతున్నారన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. వారి వెంట మాజీ ఉపసర్పంచ్ జి.ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.పుష్పదర్శన్, నాయకులు ఎండీ అజారుద్దీన్, ఎండీ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన అసోసియేషన్ నేతలు

ఎల్‌బీనగర్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌతరన్ రీజియన్ చైర్మన్ ఆదర్ల మహేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ అసిత్‌సాహలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మహేష్ మాట్లాడుతూ.. ఉద్యోగుల క్యాడర్ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, అదేవిధంగా బండ్లగూడ జీఎస్‌ఐలోని ఆడిటోరియాన్ని ఆధునీకరణ చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాజశేఖర్, శ్రీనివాసులు, మేఘరాజ్, సునిల్‌కుమార్, ప్రభాకర్, శివశంకర్, ఆనంద్‌కుమార్ ఉన్నారు.

కార్పొరేషన్‌లో పార్కులు సుందరీకరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ పార్కు స్థలాలను సుందరీకరణ చేయాలని కోరుతూ సోమవారం మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో విశాఖనగర్ ఫేస్–2 కాలనీవాసులు కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖనగర్ కాలనీలో సర్వే నంబర్ 128లో 1800 గజాల పార్కు స్థలం ఉందని తెలిపారు. అందులో నీడనిచ్చే చెట్లు, పచ్చిక బయళ్లు, చిన్నారులు ఆడుకునేలా ఆటవస్తువులు ఏర్పాటు చేయాలన్నారు. పార్కులు లేక చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారని పుర్కొన్నారు. ఇంట్లోనే ఉంటున్న పెద్దలు, మహిళలకు కొద్దిసేపు అలా సేదతీరేందుకు పార్కులను అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఇందులో విశాఖనగర్ ఫేస్–2 కాలనీ అధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బయోమెట్రిక్‌ను తొలగించాలి

ఇబ్రహీంపట్నం: బయోమెట్రిక్ విధానాన్ని తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పంచాయతీ అధికారి రఘుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు రాజ్‌కుమార్, శివకుమార్, రవీందర్, మల్లేశ్, శ్రీలత, రాధ, అలివేలు, మమతలు మాట్లాడారు. బయోమెట్రిక్ విధానం ప్రభుత్వ ఇతర శాఖల్లో లేదని, అది తమకు పెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. పారిశుద్ధ్య మెరుగు, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణ, పైపులైన్ లీకేజీల మరమ్మతులకు ఏడాది కాలంగా సొంత డబ్బును వెచ్చిస్తున్నామని తెలిపారు. కార్యదర్శుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, వెంటనే అభివృద్ధి పనుల నిధులు మంజూరు చేయాలని, దాంతో పాటే బయోమెట్రిక్‌ను తొలగించాలని కోరారు. దీనికి స్పందించిన పంచాయతీ అధికారి.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారని కార్యదర్శులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, తీగల కింద చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ అల్మాస్‌గూడ ఫీడర్ పరిధిలోని సీవైఆర్ కమాన్, ఆర్‌బీరెడ్డికాలనీ, ఎస్‌బీఆర్‌కాలనీ, ఎంజేఆర్‌కాలనీ, అల్మాస్‌గూడ ఓల్డ్ విలేజ్, వివేకానంద, అల్మాస్‌గూడ హనుమాన్ టెంపుల్, హరితహోమ్స్, సాయిప్రభుహోమ్స్, శివనారాయణపురం, వెంకటేశ్వరకాలనీ, వరలక్ష్మీ కాలనీ, మహాలక్ష్మీనగర్, సమతానగర్, సీతాహోమ్స్ ఫేజ్–4, అంగన్‌వాడీ బడంగ్‌పేట, బడంగ్‌పేట క్రాస్‌రోడ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ ప్రశాంతి హిల్స్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో సౌభాగ్యలక్ష్మీనగర్, షిర్డీనగర్, శేషాద్రినగర్, కాకతీయకాలనీ, మల్లారెడ్డికాలనీ, సాయిబాలాజీ టౌన్‌షిప్, సీతాహోమ్స్ ఫేజ్–2, నవయుగ ఎన్‌క్లేవ్, సాయికృష్ణ ఎన్‌క్లేవ్‌లలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు.

వర్షాకాలం దృష్ట్యా పూడికతీత పనులు



డ్రైనేజీలో పూడికతీత పనులు చేయిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

మీర్‌పేట: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీలు, బస్తీల్లోని భూగర్భ డ్రైనేజీల్లో ముందస్తుగా పూడికతీత పనులు చేపడుతున్నామని కమిషనర్ జ్ఞానేశ్వర్ అన్నారు. మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం కార్పొరేషన్ పరిధి 05, 40 వార్డులలో గల్పర్ వాహనంతో డ్రైనేజీల్లోని చెత్తను తొలగించే పనులు చేపట్టారు. అనంతరం కమిషనర్ కాలనీవాసులకు హోం కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పర్యావరణ ఇంజినీర్ రాము, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి లక్ష్మీనర్సింహా కాలనీలో 40 ఫీట్ల రోడ్డును కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని నాగోలుకు చెందిన బుషిరెడ్డి రంగారెడ్డి సోమవారం హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాగోలు నుంచి గతంలో నక్షబాట, అక్కడ 40 ఫీట్ల రోడ్డు ఉండేదని కొంతమంది స్థానికంగా కొత్త లేఅవుట్ తయారు చేసి అక్రమంగా రోడ్డును ఆక్రమించుకొని ప్లాట్లుగా విక్రయించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతర్గత రోడ్ల ఏర్పాట్లపై దృష్టి

దిల్‌సుఖ్‌నగర్: డివిజన్‌లో అంతర్గత రోడ్ల ఏర్పాటుకై ప్రత్యేక దృష్టి సారించినట్లు రామకృష్ణాపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధ్వానంగా మారిన రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సత్యనారాయణ

బీఆర్ఎస్ సీనియర్ నేత సత్యనారాయణ

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎర్ర శ్రీకాంత్, జామకాయల శివ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గెలుపొందిన ప్రథమ జట్టుకు రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.10వేల నగదు షీల్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అనుకున్న లక్ష్యాలను ఛేదించడానికి ఆహర్నిషలు కృషి చేయాలన్నారు. తనవంతుగా క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వద్దె బాలయ్య, నర్సింహ, ముకుందరెడ్డి, శ్రీశైలం, అజయ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

హుడాకాంప్లెక్స్: చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బ్రాహ్మణులను కానీ ఇతర కులాలు, మతాలను కానీ కించపరిస్తే ఊరుకునేది లేదన్నారు. మంచు మోహన్‌బాబు కుటుంబం బ్రాహ్మణ జాతిపై పగబట్టిందనే బాధ బ్రాహ్మణులలో నెలకొందన్నారు. గతంలో దేనికైనా రెడీ అనే సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు చిత్రించడమే కాకుండా వారిపై భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. తాజాగా కన్నప్ప సినిమాలో పిలక, గిలక అనే రెండు పాత్రలను రూపొందించి బ్రాహ్మణులను మరోసారి కించపరిచారని, కన్నప్ప సినిమా హైకోర్టులో కేసు ఉండగానే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం చట్టాలను ఉల్లంఘించడం కాదా అని ప్రశ్నించారు. కన్నప్ప సినిమాలోని పిలక, గిలక సన్నివేశాలను తొలగించాలని శ్రీనివాసరావు కోరారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణనాయక్

కందుకూరు: భూభారతిలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, డైరెక్టర్ ఎ.సురేందర్, మాజీ ఉప సర్పంచ్ జి.రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో ధరణి చట్టంతో రైతులు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. ఆ సమస్యలను పరిష్కరించడానికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని భూభారతి చట్టాన్ని తెచ్చి అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, నాయకులు ఎ.శ్రీనివాస్, ఆర్.సత్యం, జహంగీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

స్టేటస్ కో సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి కమలానగర్, ఆంధ్రకేసరి నగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్లపై విధించిన స్టేటస్ కో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. సోమవారం కమలానగర్ కాలనీ కమ్యూనిటీహాల్లో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం తాము స్థలాలు కొని ఇళ్లు కట్టుకున్నామని, ఇప్పుడు కొందరు ఇనాం భూములంటూ కోర్టుకు వెళ్లి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. కొంతమంది నాయకులు తెరవెనుక ఉండి ఇలాంటి రిజిస్ట్రేషన్లు నిలిపివేత చర్యలు చేపడుతూ వసూళ్లకు తెరలేపారని అలాంటి వారి చర్యలు సాగవని, అధికారులు ఎవరైనా స్టేటస్ కో అంటూ చట్టవిరుద్ధంగా వ్యవహరించాలని చూస్తే వారి స్టేటస్ తొలగించేలా చేస్తామని మధుయాష్కీ హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చెన్నగోని రవిందర్, కమలానగర్ కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, దివాకర్, వెంకటేశ్వర్లు, పాశం అశోక్‌గౌడ్, సత్యనారాయణ, పట్లోళ్ల మాధవరెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్ కమర్షియల్ టాక్స్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్లు ప్రారంభించేటప్పుడు సరైన లెవెల్స్ చూసుకోవాలని, అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలన్నారు. కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ వెంట రవీందర్, విశ్వేశ్వరయ్య, రామకృష్ణ, రాజు, సురేందర్ చారి, నాయికోటి అనిల్ కుమార్ ఉన్నారు.

సామాజిక న్యాయం.. కాంగ్రెస్‌తో సాధ్యం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురికి మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం వారికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణలో కొత్తగా పదవులు దక్కించుకున్న వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీల ఆలోచనల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తుందని చెప్పారు. దశాబ్దకాలంగా సొంతింటి కోసం ఎదురుచూసిన వారి కలలను సాకారం చేస్తుందన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి

- నీటి వినియోగం తగ్గించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనువాస్

యాచారం: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే విధంగా పంటలు పండించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. యాచారం మండలం నస్దిక్‌సింగారం, మొండిగౌరెల్లి గ్రామాల్లో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక పంటల సాగుతో పాటు స్వల్పకాలంలో చేతికి వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గించాలని, మార్కెట్లో ధరలను బట్టి సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, శాస్త్రవేత్తలు రాజేశ్వర్, కిరణ్‌కుమార్, సునీత, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.